

పట్టిసీమ నుంచి జలాలు విడుదల

ప్రజాశక్తి - పోలవరం


గోదావరి నీటిమట్టం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు 3,540 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్లు ఆ పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. గత నెల 14వ తేదీ నుంచి ఇప్పటివరకు 7.3214 టిఎంసిల నీటిని కృష్ణా డెల్టాకు విడుదల చేసినట్లు డిఇ తెలిపారు. గోదావరి నీటిమట్టం 23.444 మీటర్లకు పైగాకి ఉందని, సాగు నీటి అవసరతను బట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదనపు పంపులు, మోటార్లతో నీటి పంపిణీ చేస్తామని తెలిపారు.

కౌలు రైతులకు రుణాలేవీ..!



'ఏలూరు జిల్లా వార్షిక పంట రుణాల లక్ష్యం రూ.7,300 కోట్లు. కౌలురైతులకు రుణాల మంజూరు లక్ష్యం రూ.250 కోట్లు నిర్ణయించడం ఏమిటి.. జిల్లాలో 75 శాతానికిపైగా సాగును కౌలురైతులు చేస్తున్నారు.. అందుకు అనుగుణంగా వారికి పంట రుణాల లక్ష్యం రూ.రెండు వేల కోట్లకు పెంచాలి' అని ఏలూరు జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు పంట రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్న మంత్రి ఆదేశాల అమలుపై సర్వత్రా చర్చ సాగుతోంది.

పంట రుణాల లక్ష్యంపై మంత్రి పార్థసారధి ఆదేశాలు అమలయ్యేనా

ఏలూరు జిల్లాలో రూ.2 వేల కోట్లు రుణాలివ్వాలని మంత్రి ఆదేశం

'పశ్చిమ'లో అంతకు మించి రుణాలిస్తేనే కౌలు రైతులకు న్యాయం

లక్ష్యానికి అనుగుణంగా కొరవడిన అధికారుల కార్యాచరణ

కౌలుకార్డుల జారీలో తొలగని ఇబ్బందులు

రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు

కార్డుల జారీ లక్ష్యం మాత్రం లక్షా 82 వేలే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లాలోనే కాదు.. పశ్చిమగోదావరి జిల్లాలోనూ కౌలురైతులకు పంట రుణాలపై అధికారులు నిర్దేశించిన లక్ష్యం అత్యంత దారుణంగా ఉంది. కౌలురైతులకు పంట రుణాల మంజూరులో గత ప్రభుత్వంలోని పాలకులు, అధికారులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా మారిందని చెప్పొచ్చు. ప్రభుత్వం మారడంతో కౌలురైతులకు జిల్లా వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళికకు అనుగుణంగా పంట రుణాలు మంజూరు చేయాలని సమాచార శాఖా మంత్రి పార్థసారధి జిల్లా సమీక్షా సమావేశంలో అధికారులకు ఇచ్చిన ఆదేశాలు అమలు చేస్తేనే కౌలురైతులకు న్యాయం జరుగుతుంది. మంత్రి ఆదేశాలకు అనుగుణంగా అధికారుల కార్యాచరణ ఏమాత్రం కన్పించడం లేదు. ప్రస్తుత పరిణామాలు అందుకు అద్దం పడుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3.15 లక్షల మంది కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేసిన పరిస్థితి కొనసాగింది. ప్రస్తుతం కౌలుకార్డుల జారీపై అధికారులు తీసుకున్న లక్ష్యం అందులో సగం కూడా లేని పరిస్థితి నెలకొంది. 'పశ్చిమ'లో లక్షా ఆరు వేలు, ఏలూరు జిల్లాలో 76 వేలు మొత్తం లక్షా 82 వేల కౌలుకార్డులు మాత్రమే జారీ చేయాలని అధికారులు లక్ష్యం నిర్ణయించుకున్న పరిస్థితి నెలకొంది. మరో లక్షా 20 వేల మంది కౌలురైతులకు కౌలుకార్డుల జారీ ప్రశ్నార్థకంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వార్షిక పంట రుణాల లక్ష్యం రూ.ఏడువేల కోట్లకుపైగానే ఉంది. జిల్లాలో 75 శాతానికిపైగా వ్యవసాయ సాగు చేస్తున్న కౌలురైతులకు పంట రుణాల కింద రెండు జిల్లాల మొత్తంగా చూసినా రూ.600 కోట్లకు మించి లేకుండా పోయింది. రెండు జిల్లాల్లో దాదాపు రూ.14 వేల కోట్ల పంట రుణాల లక్ష్యంలో పట్టుమని రూ.600 కోట్లు కూడా ఇవ్వకపోతే వాస్తవ సాగుదారులైన కౌలురైతులు ఏవిధంగా సాగు చేయాలో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు మంత్రి ఆదేశాలకు అనుగుణంగా కౌలురైతులకు పంట రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.


నిబంధనలు మార్పుచేసి కౌలుకార్డులు జారీ చేసేనా?

గత ప్రభుత్వం భూయజమాని అంగీకారంతో కౌలుకార్డులు జారీ చేయాలని నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతో భూయజమానులు కౌలురైతులకు కౌలుకార్డులు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీంతో కౌలుకార్డుల జారీ, రుణాల మంజూరుసైతం సక్రమంగా జరగడం లేదు. దీంతో పంట దెబ్బతింటే నష్టపరిహారం, బీమా పరిహారంగాని, అన్నదాత సుఖీభవ వంటి పథకాలుగాని అందే పరిస్థితి లేకుండాపోయింది. ప్రభుత్వం నిబంధనలను మార్పుచేసి కౌలురైతులకు రుణార్హత కార్డులు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలా చేయకపోతే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి లేకుండాపోతుంది. దీనిపై ప్రభుత్వం ఎవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

గోదావరి దోబూచులాట

తొమ్మిది రోజులుగా వీడని ముంపు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్


వేలేరుపాడు మండలాన్ని వీడని వరద

పది రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వస్తున్న గోదావరి వరద దోబూచులాట కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం వరకూ తగ్గిన గోదావరి వరద మళ్లీ స్వల్పంగా పెరిగి నిలకడగా ఉంది. భద్రాచలంలో గురువారం 49 అడుగులకు చేరిన వరద శుక్రవారం రెండు అడుగులు తగ్గి 47 అడుగులకు చేరింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఇప్పటికే మండలంలోని దాచారం-కుక్కునూరు, ముత్యాలంపాడు-వింజరం మధ్య రహదారులను గోదావరి వరద ముంచెత్తడంతో తొమ్మిది రోజులుగా ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి అనేక ఇబ్బందులు పడుతూ చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వరద ముంపు తగ్గడంతో సీతారామనగరం-వేలేరు మధ్య రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మండలంలోని గొమ్ముగూడెం, లచ్చిగూడెం, వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము గ్రామాలకు చెందిన వరద బాధితులు మండలంలోని రావికుంట పునరావాస కాలనీలో కౌండిన్యముక్తి గ్రామానికి చెందిన వరద బాధితులు మద్రిపాడు పునరావాస కాలనీలో తలదాచుకున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో గోదావరికి వరద ముప్పు పొంచి ఉందని విలీన మండలాల ప్రజలు ఆగస్టు వరకూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

స్పిల్‌వే నుండి 11,06,947 క్యూసెక్కుల వరద జలాల విడుదల

పోలవరం: పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 23.877 మీటర్లకు చేరుకుంది. వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న 11,06,947 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఇఇ మల్లికార్జునరావు, డిఇ మాధవరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.150 మీటర్లు, స్పిల్‌వే దిగువన 24.800 మీటర్లు నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

ఆచంట: వారం రోజులుగా దోబూచులాడుతున్న వశిష్టగోదావరి వరద శాంతించడంతో మండలంలోని లంక గ్రామాలు జలదిగ్బంధం నుంచి బయటపడ్డాయి. శుక్రవారం ఉదయం నుంచి క్రమేపీ గోదావరి తగ్గుముఖం పట్టింది. దీంతో లంక గ్రామాలైన అయోధ్యలంక, పచ్చల్లంక, భీమలాపురంలో వరద నీరు పూర్తిగా తొలగిపోయింది. లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు వరద తొలగడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. పలు ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు తిరిగి గోదావరిలోకి చేరింది. కోడేరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, పెదమల్లం పుష్కర ఘాట్లు నీటి నుంచి తేరుకున్నాయి. పెదమల్లం మాచేనమ్మ అమ్మవారి ఆలయం వద్ద పుష్కర ఘాట్‌లో దాదాపు నాలుగు అడుగులు మేర వరద తగ్గింది. నదిలో వరద ప్రవాహ వేగం ఇంకా తగ్గకపోవడంతో నాటు పడవల రాకపోకలపై నిషేధం కొనసాగుతోంది. వరద తగ్గుముఖం పట్టడంతో మండలంలోని లంక గ్రామాల ప్రజలతోపాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మండల ప్రత్యేకాధికారి పిచ్చయ్య, తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎంపిడిఒ పి.నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వరద సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో కూరగాయలు పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆచంట ఎస్ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్లు వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

యలమంచిలి: గోదావరి వరద తగ్గుముఖం పట్టినప్పటికీ లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక, బాడవ, లక్ష్మీపాలెం, అబ్బిరాజుపాలెం, వడ్డిలంక తదితర గ్రామాలను మాత్రం వరద వీడటం లేదు. కనకాయలంక గ్రామంలోని కాజ్‌వేపై ఇప్పటికీ సుమారు ఆరడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.

మత్స్యకారుల ఉపాధికి వరద దెబ్బ

వారం రోజులుగా కొనసాగుతున్న వరద కారణంగా గోదావరి పరివాహక ప్రాంతాలైన బాడవ, ఏనుగువానిలంక, చించినాడ, యలమంచిలిలంక, వడ్డిలంక, లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం తదితర గ్రామాల్లోని వేలాది మంది మత్స్యకారుల వేటకు ఆటంకం కలగడంతోపాటు గోదావరిలో ఇసుకతీత పనులు పూర్తిగా నిలిచిపోవడంతో ఆయా మత్స్యకార కుటుంబాలకు పూట గడవని పరిస్థితి నెలకొంది. ఉపాధి కోల్పోయిన తమకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి నిత్యావసర సరుకులను అందించాలని ఆయా గ్రామాల మత్స్యకారులు కోరుతున్నారు.

రొయ్యల సాగూ వరద పాలు

మండలవ్యాప్తంగా గోదావరిని ఆనుకొని వందలాది ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. వరద నేపథ్యంలో హడావుడిగా రొయ్యల పట్టుబడి చేసి అయినకాడికి విక్రయించారు. దీంతో లక్షల్లో నష్టపోవాల్సి వచ్చిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కోడేరులో తగ్గుముఖం పట్టిన గోదావరి

శ్మశానవాటిక ఆక్రమణను ఆపండి

కొత్త ఉంగుటూరులో గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - ఉంగుటూరు


శ్మశానవాటిక వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

ఉంగుటూరు పంచాయతీ పరిధి కొత్త ఉంగుటూరులో క్రైస్తవుల స్మశాన వాటిక స్థలాన్ని ఆక్ర మించి తన క్వారీలో చెరువులోకి దారి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న భూస్వామిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దారు కట్టా శివయ్యకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.కొత్తఉంగుటూరులో సుమారు300 మందికి సంబంధించిన క్రిస్టియన్ల స్మశాన వాటిక భూమి పంచాయతీ జిరాతీ భూముల్లోనేఉంది. స్థానిక భూస్వామికి ఈ స్మశాన వాటికను అనుకుని గతంలో కంకర తవ్వేసిన క్వారీ చెరువులో చేపల సాగులో ఉంది. ఈక్వారీలోకి సమాధులును కూటికి వేళ్లతో జేసీబీతో రాత్రికి రాత్రి తవ్వేసి చెరువులోకి సమాధులు శిధిలాలు, మట్టిని గెంటేశారని బాధితులు ఆవేదన చెందారు. ప్రతి ఏటా సమాధుల వద్ద చనిపోయిన మా కుటుంబ సభ్యులను స్మరించుకునేవారిమని ఇప్పుడు వాటి ఆన వాళ్లు సైతం లేకుండా నేలమట్టం చేయడంతో బాధితులు స్మశాన వాటిక వద్ద ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న అధికారుల ఆదేశాలతో రెవెన్యూ ఇనెస్పెక్టర్ ఎస్.సత్య నారాయణ, వీఆర్వో, సచివాలయం ఉద్యోగులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ఉంచారు.బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని సర్పంచి బండారు సింధు పేర్కొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి - ఏలూరు / వేలేరుపాడు

వరద ముంపునకు గురైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని కుటుంబాలకు జిల్లా యంత్రాంగం నిత్యావసర సరుకులు, కాయగూరలను పంపిణీ చేసింది. జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ ఎస్.సత్యనారాయణరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాబ్జి, డ్వామా పీడీ పి.రాము, సిబ్బంది కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని తోటకూరగొమ్ము, దాచారం ఆర్అండ్ఆర్ కాలనీ, మద్రిపాడు ఆర్అండ్ఆర్ కాలనీ, కౌడిన్య ముక్తి, తదితర గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబానికి రూ.ఐదు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకేజీ వంటనూనె, ఐదు రకాల కాయగూరలు వరద బాధిత కుటుంబాలకు అందించారు. వరద సహాయక చర్యలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని, వెంటనే పరిష్కారానికి చర్యలు తీసు కుంటామని అధికారులు ఆయా గ్రామాల ప్రజలకు తెలిపారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు

డిఎల్‌పిఒ సుందరి

ప్రజాశక్తి - ముసునూరు


అధికారులతో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా డిఎల్‌పిఒ సుందరి తెలిపారు. మండలంలోని వేల్పుచర్ల, కాట్రేనిపాడు, గోపవరం ఆయా గ్రామాల్లో ఇఒపిఆర్‌డి ఎస్‌వి.శ్రీనివాసరావు, సర్పంచి పుట్టా మోహన్‌రావు, గద్దల సుహాసిని మోహన్‌రావు, కంచర్ల వాణి, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావులతో కలిసి ఎస్‌సి, బిసి ఏరియాల్లో అపరిశుభ్రంగా ఉన్న ఏరియాలను పరిశీలించి వెంటనే తొలగించే విధంగా చర్యలు చేపట్టారు.

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సిఐ క్రాంతికుమార్

ప్రజాశక్తి - టి.నరసాపురం

పాఠశాల స్థాయి నుంచే బాలికలు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జీలుగుమిల్లి సిఐ టి.క్రాంతికుమార్ సూచించారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్లో శుక్రవారం బాలికలపై లైంగిక నిరోధక (పోక్సో) వంటి చట్టాలు, నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సమాజంలో బాలికలు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులను నివారించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చట్టాలు అమలు చేస్తుందన్నారు. ఎవరైనా లైంగిక దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బాలికలందరూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. నేరాలకు పాల్పడి మంచి భవిష్యత్తు పాడుచేసుకోవద్దని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు, హెచ్‌ఎం లింగుస్వామి, కృష్ణారావు ఉన్నారు.

వరద సాయంపై ఫిర్యాదులొస్తే అధికారులపై చర్యలు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - వేలేరుపాడు


బోటుపై ముంపు గ్రామాలకు వెళ్తున్న కలెక్టర్, జెసి

వరద బాధితులకు సహాయక కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని, ప్రజల నుండి ఫిర్యాదులొస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో అమలవుతున్న వరద సహాయక కార్యక్రమాలను ఆమె శుక్రవారం స్వయంగా పరిశీలించారు. తిరుమలాపాలేనికి కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి బోటుపై వెళ్లి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వరద ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల ప్రజలు తప్పనిసరిగా సహాయక కేంద్రాలకు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లాలో వరద సహాయక కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు కోట్లు కేటాయించిందన్నారు. ప్రతి బాధిత కుటుంబానికి ఐదు కిలోల బియ్యం, కందిపప్పు, వంటనూనె, ఐదు రకాల కూరగాయలు అందించాలన్నారు. వరద పరిస్థితి తగ్గే వరకు బాధితులకు సహాయ కార్యక్రమాలు అమలు జరగాల్సిందేనన్నారు. తాగునీరు, నిత్యావసర సరుకుల పంపిణీలో ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదు అందినా సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. వరద సహాయ కార్యక్రమాల్లో ఎటువంటి అలసత్వానికి, ఫిర్యాదులకు తావులేకుండా బాధితులందరికీ సాయమందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను వరద సహాయక కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సుద్దిగొంపు నుండి వరద కారణంగా రహదారి మార్గం ద్వారా వెళ్లేందుకు వీలులేని తూర్పుమెట్ట గ్రామ ప్రజలతో వీడియో కాల్ ద్వారా కలెక్టర్ పలుకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు తమకు అందించిన నిత్యావసర సరుకులు అయ్యిపోయాయని, మళ్లీ సరుకులు అందించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తూర్పుమెట్ట గ్రామస్తులకు వెంటనే ఐదు కిలోల బియ్యం, కందిపప్పు, వంటనూనె, ఐదు రకాల కాయగూరలు అందించాలని అధికారులను ఆదేశించారు. వరద సహాయక కేంద్రాలకు తరలించిన ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, పిల్లలకు పాలు అందించాలన్నారు. ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్న కుటుంబాలకు టార్పలిన్లు అందించాలన్నారు. అనంతరం సుద్దిగొంపు, కన్నయ్యగుట్ట, దాచారం తదితర గ్రామాల్లో పర్యటించి అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించని గ్రామాలకు వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని ట్రాన్స్‌కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ కె.అద్దయ్య, తహశీల్దార్ చిన్నారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆశా, భయం అనే రెండు అంశాల వల్ల ప్రజలు సైబర్ నేరాల బారిన పడుతున్నారని, ఈ రెండింటిని పరిగణలోకి తీసుకోకుండా ఉంటే కచ్చితంగా ఎవరూ సైబర్ నేరాల బారిన పడరని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో జిల్లా వ్యాప్తంగా సెల్‌ఫోన్ల రికవరీ అంశంపై విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సెల్‌ఫోన్లను సైబర్ క్రైమ్ పోలీసులు, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు సంయుక్తంగా రికవరీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ ప్రస్తుతం 151 సెల్‌ఫోన్లను జిల్లా వ్యాప్తంగా రికవరీ చేశామని, వీటి విలువ రూ.21.14 లక్షలు అని తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే టోల్ ఫ్రీ నెంబర్‌కు తమ వివరాలను ఫిర్యాదు రూపంలో తెలియజేస్తే వారి సెల్‌ఫోన్ ట్రాక్ చేస్తూ ఉంటామని తెలిపారు. పోలీసు శాఖ మరో ఆత్యాధునిక టెక్నాలజీని రూపొందించిందన్నారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారి ఫోన్‌లో ఉన్న ముఖ్యమైన సమాచారాన్ని వేరొకరు తరస్కరించకుండా ఉండేందుకు ఐఎంఇఐ నెంబర్ ప్రత్యేకంగా లాక్ ఏర్పాటు చేసే విధంగా సాఫ్ట్‌వేర్‌ని రూపొందిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఎసిబి, ఇంటెలిజెన్స్ ఇలా పలు రకాలైన శాఖలకు చెందిన అధికారులమని ప్రజలను మభ్యపెట్టి వారి వివరాలను తెలుసుకొని వాటి వివరాలతో అకౌంట్లో నుంచి డబ్బులు తస్కరిస్తున్నారని తెలిపారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయాల్సిన 1930 నెంబరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిఐ మురళీకృష్ణ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

విద్యుత్ సమస్యలపై సిజిఆర్‌ఎఫ్‌ను ఆశ్రయించొచ్చు

ఇపిడిసిఎల్‌లోక్ అదాలత్ చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విద్యుత్ సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేసినా విద్యుత్ సిబ్బంది పట్టించుకోకుండా కాలయాపన చేస్తుంటే వినియోగదారులు సిజిఆర్‌ఎఫ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించి సమస్యలను పరిష్కరించుకోవాలని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ లోక్ అదాలత్ చైర్ పర్సన్ (విశాఖపట్నం) విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. ఏలూరులోని అశోక్‌నగర్‌లో ఉన్న విద్యుత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో చైర్ పర్సన్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ వేదికలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది తమ సేవలను సక్రమంగా నిర్వహించకపోయినా వినియోగారుని సమస్య నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించని పరిస్థితిలో బాధితులు న్యాయం కోసం తమను సంప్రదించాలన్నారు. విద్యుత్ వినియోగదారుడికి బిల్లుల్లో తేడాలున్నా, విద్యుత్ కేబుల్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో ఓల్టేజ్ సమస్యలు, అదనపు లోడు మంజూరు, విద్యుత్ సర్వీస్ యజమాని పేరు మార్పు, కేటగిరి మార్పిడి వంటి సమస్యలను వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా సిజిఆర్‌ఎఫ్‌కి ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఫిర్యాదు కోసం 1912 టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ చేయాలని చెప్పారు. పలువురు వినియోగదారులు తమ సమస్యలను వినతి పత్రం ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో వి.జనార్దనరావు, రాయసం సురేంద్ర కుమార్, ఏలూరు ప్రాంత విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌టిడబ్ల్యూ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సెప్టెంబర్ ఐదో తేదీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి, నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్ అవార్డులు, జిల్లా స్థాయి అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో స్టేట్, ఎన్‌ఎఫ్‌టిడబ్ల్యూ అవార్డుల కోసం ఆగస్టు ఐదో తేదీ నుంచి ఆగస్టు తొమ్మిదో తేదీ వరకు అర్హత కలిగిన ఉపాధ్యాయులు సంబంధిత తనిఖీ అధికారి ద్వారా తమ దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపాలని, జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అవార్డులకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, టీచర్ ఎడ్యుకేటర్లు అర్హులని, 15 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసి ఉండాలని, గతంలో జిల్లా స్థాయి అవార్డు పొంది ఉండాలని, గతంలో రాష్ట్రస్థాయి అవార్డులు తీసుకున్నవారు అనర్హులని, దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులపై ఎలాంటి ఆరోపణలు, క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ కేసులు ఉండకూడదని తెలిపారు. ఎన్‌ఎఫ్‌టిడబ్ల్యూ అవార్డుకు ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు కూడా అర్హులని, వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.


ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

దళితులు, ఆదివాసీల ఉపాధి మెరుగుదలకు ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను మంజూరు చేసి అమలు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి రమణ డిమాండ్ చేశారు. దళితుల ఆత్మరక్షణ కార్యక్రమాలు, గౌరవ పోరాటాలకు మద్దతుగా సభలు, సమావేశాలు నిర్వహించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బోసు బొమ్మ సెంటర్‌లో గంపల శ్రీను అధ్యక్షతన శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సభలో కెవి.రమణ మాట్లాడుతూ ఎస్‌టి ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను అమలు చేసి వారి ఉపాధి మెరుగుదల కోసం రుణాలు ఇచ్చి అభివృద్ధికి తోడ్పడే విధంగా గతంలో ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసేవని, అటువంటి సంక్షేమ పథకాలను నిలుపుదల చేశారని, ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఆ నిధులు సంక్షేమ పథకాలతో పాటు మురికివాడల్లో ఉన్న రోడ్ల అభివృద్ధి కోసం కూడా ఉపయోగించాలని కోరారు.

గ్రేడ్ వి కార్యదర్శుల హర్షం

ప్రజాశక్తి - కామవరపుకోట


హర్షం వ్యక్తం చేస్తున్న గ్రేడ్ వి కార్యదర్శులు

2019- సచివాలయం నోటిఫికేషన్ ద్వారా సుమారు 19.5 లక్షల మంది కఠినమైన కేటగిరి-1 పరీక్ష రాసి అందులో అర్హత సాధించి పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరిన కార్యదర్శులకు డిడిఒ అధికారాలు కల్పిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై పలువురు గ్రేడ్ వి కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరి ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని సమయంతో పని లేకుండా కాలంతో పోటీ పడుతూ ప్రభుత్వం వారు తమపై ఉన్న నమ్మకంతో తమకు అప్పగించిన ప్రతి పనిని పూర్తి నిబద్ధతతో చేస్తున్నామని తెలిపారు. తమకు విధి నిర్వహణలో మొదటిగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా నియామకపు ఉత్తర్వులు ఇచ్చిన డిపిఒ శ్రీనివాస విశ్వనాధ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

'విఆర్‌ఒలకు అదనపు పని తగదు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఒడిఎఫ్ పల్స్ సర్వే విషయంలో విఆర్‌ఒలకు, ఎంపిడిఒలకు వేసిన డ్యూటీలు వెంటనే నిలుపుదల చేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తామని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులకు అసంబద్ధత డేటాతో సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్స్ చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తూనే మరో పక్క కౌలు కార్డులకు టార్గెట్లు పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు.

ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి

ప్రజాశక్తి - మండవల్లి

రిజర్వేషన్లను ప్రవేశపెట్టి సామాజిక న్యాయంతో పాటు ప్రజాస్వామిక తాత్విక పునాది ఏర్పరిచిన వ్యక్తి ఛత్రపతి సాహు మహారాజ్ అని అంబేద్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చాబత్తిన విజయ్ భాస్కరరావు స్పష్టం చేశారు. అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఛత్రపతి సాహు మహారాజ్ 151వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

వ్యాపారవేత్త నారాయణరావు మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


నారాయణరావు (ఫైల్)

మండల ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపార వేత్త మడుపల్లి నారాయణరావు(83) అనారోగ్యంతో విజయవాడలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు ఒక కుమార్తె,ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మడుపల్లి గోపాలకృష్ణ టిడిపి నూజివీడు నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులుగా పని చేస్తు న్నారు.నారాయణరావు మృతదేహానికి మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు, పలు పార్టీల నాయకులు నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పన్ను రద్దుపై రైతుల హర్షం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వర్జీనియా అదనపు పంట ఉత్పత్తి విషయంలో కేంద్ర ప్రభుత్వం సెస్ పన్ను రద్దుపై తీసుకున్న నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రంలో రైతు ప్రతినిధులు సమావేశంలో అగ్రిడ్జ్ రైతులకు ప్రయోజనం కలిగేలా కేంద్రం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

భీమడోలు :యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, చట్టాన్ని గౌరవిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎక్సైజ్ శాఖ భీమడోలు సిఐ గిరిజాకుమారి కోరారు. భీమడోలులోని శ్రీ మాధురి జూనియర్ కళాశాల బాలికల ప్రత్యేక క్యాంపస్‌లో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.బాలు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎక్సైజ్ సిఐ కార్గిల్ యుద్ధం పూర్వపరాలు, భారత సైన్యం సాధించిన విజయం, భారతదేశ ప్రతిష్టను కాపాడిన వైనం, ఇతర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు కళాశాల ప్రిన్సిపల్ అశోక్, కేసరి, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

నేరాలు - ఘోరాలు

ఉద్యోగాలిప్పిస్తానని మోసం

కామవరపుకోట :ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి నిరుద్యోగుల దగ్గర నుంచి సుమారు రూ.25 లక్షల వరకు డబ్బులు వసూలు చేసింది డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకురాలుగా పని చేసిన ఓ మహిళా ఉద్యోగి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కామవరపుకోట మండలానికి చెందిన ఓ మహిళ కామవరపుకోట, తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకురాలిగా కాంట్రాక్ట్ విధానంపై పని చేసింది. నిరుద్యోగులైన పలువురి వద్ద నుంచి కళాశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి దగ్గర నుంచి సుమారు రూ.50 వేల నుండి రూ.నాలుగు లక్షల వరకు వసూలు చేసింది. కాలం గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు ఇటీవల ఆమెపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు, రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదుపై కమిషనర్ ఆదేశాల మేరకు కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శోభారాణి గురువారం తణుకు కళాశాలలో విచారణ చేపట్టి, శుక్రవారం కామవరపుకోట రావడంతో విషయం తెలుసుకున్న బాధితులు, ఒక్కొకరుగా వచ్చి కళాశాలలో ఆందోళన చేపట్టారు. ఆర్‌జెడి శోభారాణి స్పందిస్తూ ఆమెను ఉద్యోగం నుంచి తొలగించామని, అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని బాధితులకు ఆమె హామీ ఇచ్చారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

ఉంగుటూరు :జాతీయ రహదారి నాచుగుంట వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనగా వ్యక్తి గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమర్రుకు చెందిన కోనా ప్రసాద్ ద్విచక్రవాహనంపై తాడేపల్లిగూడెం వెళుతుండగా నాచుగుంట బైక్ అదుపుతప్పడంతో కింద పడి గాయాలపాలయ్యాడు. స్థానికులు సమాచారం ఇచ్చినా హైవే, 108 అంబులెన్సులు అందుబాటులో లేకపోవడంతో చాలా సేపు రోడ్డు మీదే పడి ఉన్నాడు. ప్రజాశక్తి సమాచారంతో పోలీసులు, హైవే సిబ్బంది అప్రమత్తమై చేబ్రోలు ఎస్ఐ మణికుమార్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పోలీసు పెట్రోలింగు వాహనంలోనే క్షతగాత్రుడిని తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో అంబులెన్సు రావడంతో ఆందులోకి ఎక్కించి పంపించారు. ఉంగుటూరు టోల్ ప్లాజాకు కిలో మీటరు దూరంలోపే ప్రమాదం జరిగినా దాదాపు 25 నిమిషాల వరకూ సహాయక చర్యలు అందకపోవడం పట్ల వాహనదారులు విమర్శిస్తున్నారు. ప్రమాదం బారిన పడిన వారికి ప్రథమ చికిత్స అందిస్తూ సకాలంలో ఆసుపత్రికి తరలించేలా అప్రమత్తంగా ఉండాలని వాహనదారులు కోరుతున్నారు. హైవే గోతులను పూడ్చించాలని కోరుతున్నారు.

ఇసుక లారీ బోల్తా : తప్పిన ప్రమాదం

ద్వారకాతిరుమల :ద్వారకాతిరుమల యాదవ కళ్యాణ మండపం మలుపు వద్ద ఇసుక లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌కు ఫోన్ చేసి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు.

ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాని బాధితులు

నవరత్నాలకు భయపడుతున్న వ్యాపారులు

ముదినేపల్లి :స్థానిక సంత మార్కెట్ పరిసరాల్లో ప్రభుత్వ స్థలాలను కొందరు వ్యక్తులు (వీరిని నవరత్నాలని పిలుస్తారు.) ఆక్రమించి పలువురు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. అలాగే మరికొన్ని స్థలాలను చిరు వ్యాపారులకు అద్దెలకిస్తూ వారి నుంచి రోజువారి, నెలవారి అద్దెలు వసూలు చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల ప్రజాశక్తిలో ఇచ్చట స్థలాలు అమ్మబడును అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన ఓ వ్యాపారి నవరత్నాల వద్ద నుంచి రూ.50 వేలుకు స్థలం కొనుగోలు చేసి మోసపోయిన విషయం వెలుగులోకి వచ్చింది. సదరు బాధితుడు ప్రజాశక్తి వద్ద తాను మోసపోయిన ఉదాంతాన్ని వెలిబుచ్చుకున్న విషయం తెలిసిందే. ఈ విషయమై సొమ్ము పోయే, స్థలం పోయే అనే శీర్షికతో మరో కథనం ప్రజాశక్తిలో ప్రచురితమైంది. సంత మార్కెట్‌లో ఆర్‌అండ్‌బి స్థలాలను నవరత్నాలు కొన్నేళ్లుగా ఆక్రమించుకుని విక్రయాలు జరుపుతూ, చిరు వ్యాపారులకు అద్దెలకిస్తూ జల్సాగా జీవనం కొనసాగిస్తున్నారు. నవరత్నాలు కారణంగా మోసపోయిన పలువురు బాధితులు ముందుకొచ్చి అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారు. మీడియా ముందుకు వచ్చి తమ గాధను చెప్పేందుకు భయపడుతున్నారు. తమ పేర్లు మీడియాలో వస్తే తమను నవరత్నాలు బతకనివ్వరని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ స్థలమైనప్పటికీ చేసేదిలేక రోజువారి, నెలవారి నవరత్నాలకు అద్దెలు చెల్లిస్తూ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. చిరు వ్యాపారుల విలేకరి ప్రశ్నిస్తే తాము ఆర్‌అండ్‌బి స్థలాలు కొన్న విషయం, అద్దెలు చెల్లిస్తున్న విషయం వాస్తవమేనని, అయితే నవరత్నాలు పేర్లు బయటికి చెబితే తమను బతకనివ్వరని, తాము ఇక్కడ వ్యాపారం చేయలేమని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను అమ్ముకుంటూ, చిరు వ్యాపారులకు అద్దెలకిస్తూ అక్రమార్జన చేస్తున్న నవరత్నాలపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమణారావు

ఏలూరు అర్బన్ :కార్మికులు ఐక్యంగా పోరాడితేనే హక్కులు సాధించుకోవచ్చని, ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెప్పి కార్మికులకు ఆశ కల్పించిందని, కాని ఆచరణలో ఉచిత ఇసుక అందించడంలో ప్రభుత్వం విఫలమైందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారపల్లి రమణారావు విమర్శించారు. సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఏలూరు సిఐటియు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఉచిత ఇసుక ఎవరికీ అందడం లేదన్నారు. కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక అందించి కార్మికుల ఉపాధి కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారని, వాటిని వెంటనే అమలు చేసి సంక్షేమ పథకాలు వెంటనే కార్మికులకు అందించాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిర్మాణ మెటీరియల్ ధరలు ఆకాశాన్ని అంటడం వల్ల కార్మికులకు ఉపాధి పడిపోతుందన్నారు. మెటీరియల్ ధరల నియంత్రణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాధవ, రెడ్డి లక్ష్మణరావు, కెల్లా దుర్గాప్రసాద్,సి.హెచ్ కొండలరావు, చీరా అప్పారావు, పీవీ నరసింహారావు పాల్గొని మాట్లాడారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి - వేలేరుపాడు

ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు వరద ముంపునకు గురైన కుటుంబంలకు ఆలిండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ఫౌండర్ జయశాలి పిడి సుందరరావు పిలుపుమేరకు ఎఐటిసిసి ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేశారు. మేడిపల్లి, కమ్మరిగూడెం గ్రామాల్లో 50 కుటుంబంలకు బిఒయుఐ తెలంగాణ జోన్ డిప్యూటీ డైరెక్టర్ ఇ.సంతోష్ కుమార్ అధ్యక్షతన సహాయం అందించారు.

ఆగిపోయిన ప్రయివేట్ స్కూల్ బస్సు

జంగారెడ్డిగూడెం టౌన్ :మండలంలోని దేవులపల్లి బొర్రంపాలెం అడ్డ రోడ్డు ప్రయివేట్ స్కూల్ బస్సు ఆగిపోయింది. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయమని ఎంపిడిఒ పి.శామ్యూల్ అన్నారు. ఆగిరిపల్లి మండల డిపిఆర్‌టియు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలలకు, ఆగిరిపల్లి హైస్కూల్ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.

సాంకేతిక విద్యతోనే భవిష్యత్తు

ప్రజాశక్తి - దెందులూరు

సాంకేతిక విద్యను నేర్చుకుంటేనే విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని పి.వెంకటేశ్వరరావు అన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక కొదరు వైలలో సాంకేతిక నైపుణ్యాల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీకి చెందిన సిబిఎస్ఇ బోర్డు సరఫరా చేసిన నూతన కంప్యూటర్లు, ప్రింటర్లను వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు అంతా డిజిటల్ విద్యేనని విద్యార్థులు గుర్తించాలన్నారు.

పోలవరం :గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు డిజిటల్ వనరుల వినియోగంపై కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఐఎఫ్‌పి ప్యానల్స్ వినియోగం, కంప్యూటర్ ఉపయోగాలు, ఇంటర్నెట్ వినియోగంపై వివరించారు. ఏడో తరగతి విద్యార్థినులు బాలకుర్తి సంధ్య, నస్రీన్ కంప్యూటర్ ఉపయోగాలను చక్కగా వివరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవన్ మాట్లాడుతూ డిజిటల్ వనరుల వినియోగంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

చింతలపూడి :గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయని అసిస్టెంట్ మలేరియా అధికారి రామరాజు, పి.శ్రీనివాసరావు అన్నారు. ప్రగడవరం శివారు శ్రీరామపురంలో చేపట్టిన దోమల నివారణ కార్యక్రమాన్ని వారు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు.

పోలవరం :పోలవరం పంచాయతీ జగన్నాథపేట గ్రామంలో శుక్రవారం వైద్య సిబ్బంది డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో కుండీలా వాషింగ్ మెషిన్లు, కూలర్లలో నీటిని తొలగించారు. గ్రామస్తులకు సికిల్ సెల్ ఎనీమియా, దోమల వల్ల ప్రబలే వ్యాధులు, నివారణ అంశాలపై అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎంపిహెచ్ఇఒ గుగ్గులోతు సోమరాజు, గంగాభవాని, ఎంపిహెచ్ఎ విశ్వనాధ్, ఎఎన్ఎం జ్యోతి, ఆశా వర్కర్లు, అత్తిలి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు అందించాలని వినతి

ప్రజాశక్తి - ముసునూరు

కౌలు రైతులకు కార్డులు ఇచ్చే లక్ష్యంలో రాష్ట్రంలో ఏలూరు జిల్లా రెండో స్థానంలో ఉందని, ముసునూరు మండలంలో కౌలు రైతులు అధికంగా ఉన్నారని ఏలూరు జిల్లా వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ షేక్ అబీబ్‌బాషా తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్లను ఆయన శుక్రవారం కలిసి కౌలు రైతులకు రుణం అందించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

చాట్రాయి :కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖాధికారులు శుక్రవారం బ్యాంకర్లను కలిసి చెప్పారు. ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్.హబీబ్‌బాషా, నూజివీడు డివిజనల్ వ్యవసాయ సంచాలకులు జి.విద్యాసాగర్, చాట్రాయిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించి కౌలు రైతులకు బ్యాంకర్ల ద్వారా రుణ సదుపాయం ఇప్పించాలని తీర్మానించి చాట్రాయిలోని ఎస్‌బిఐ, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్లను కలిసి కౌలు రైతులకు రుణ సదుపాయం ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందించారు. అనంతరం చాట్రాయిలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపుల్లోని ఎరువు బస్తాలను, పురుగుమందులను పరిశీలించారు. నాణ్యమైన ఎరువులను విక్రయించాలని, లేకపోతే డీలర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. చాట్రాయి, జనార్ధనవరం గ్రామాల్లో వరి పైరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.శివశంకర్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు సర్వీసు పునరుద్ధరించాలని వినతి

బుట్టాయగూడెం : రెడ్డిగణపవరం -జంగారెడ్డిగూడెం గ్రామాల మధ్య ఆర్‌టిసి బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని కోరుతూ రెడ్డి గణపవరం ఎంపిటిసి మాజీ సభ్యులు అందుగుల ఫ్రాన్సిస్ జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపో అసిస్టెంట్ మేనేజర్ వరలక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుట్టాయగూడెం-రెడ్డిగణపవరం గ్రామాల మధ్యలో ఉన్న కాజ్‌వే పాడైపోవడంతో ఈ రెండు గ్రామాల మధ్య వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఎపిఎస్ ఆర్‌టిసి సర్వీసులను కూడా నిలిపివేశారన్నారు. దెబ్బతిన్న జల్లేరు కాజ్‌వే మరమ్మతులు ఇటీవల జరిగాయని, స్కూల్ బస్సులు, లారీలు, ఆటోలు తదితర వాహనాలు అన్ని యధావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. జంగారెడ్డి గూడెం డిపో నుంచి రెడ్డిగణపవరం గ్రామానికి వచ్చే ఆర్‌టిసి బస్సు సర్వీస్ కూడా తిరిగి రాకపోకలు కొనసాగించేందుకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. రహదారి మరమ్మ తులు జరిగాయని, ఆర్‌టిసి సర్వీసులు పునఃప్రారంభించాల ని కోరారు.

బాధిత కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆలిండియా క్రిస్టియన్ కమిటీ (ఎఐసిసి) ఉంగుటూరు మండల గౌరవ అధ్యక్షులు జి.జాన్ గంగాధర్ ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో కమిటీ ఉంగుటూరు మండల సేవకులు జాన్ గంగాధర్ భార్య కమలకు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, బిషప్, ఎం,డేవిడ్ లివింగ్ స్టన్, స్టేట్ లీగల్ సెల్ అధ్యక్షులు ఇంజేటి, రాజేష్, మండల ప్రెసిడెంట్ రెవ డి.రాజు, జనరల్ సెక్రటరీ జి.యోహాను, నియోజకవర్గ నాయకులు రెవ డి.చెల్లప్ప, రెవ ఎం.యోనా రత్నాకర్, వైస్ ప్రెసిడెంట్ రెవ ఎం.మోషే, జాయింట్ సెక్రటరీ రెవ డాక్టర్ హనోక్, ఏలూరు జిల్లా ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ ఎస్తేరు, కాకినాడ జిల్లా ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ జెన్నీఎలిజబెత్ పాల్గొన్నారు.

మండవల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

మండవల్లి :స్థానిక నాగేంద్ర స్వామి కళ్యాణ మండపంలో శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సర్పంచి మెండ ఝాన్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి, ప్రముఖులు గుడివాడ చిట్టిబాబు మాట్లాడుతూ మానవ శరీరంలోని అవయవాలన్నిటిలో నేత్రం చాలా విలువైందన్నారు. అంతటి విలువైన అవయవానికి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. కంట్లో సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే కంటి చూపు పోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. మండవల్లిలో ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంపై శంకర్ నేత్రాలయం వైద్యులు దివ్య రవళి సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం 148 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. 43 మందికి శస్త్ర చికిత్స ఉచితంగా నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విద్యార్థులకు ఏలూరు నగరంలో శుక్రవారం కార్గిల్ దివస్ దినోత్సవం సందర్భంగా పుస్తకాలు పంపిణీ చేసినట్లు హేలాపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ పి.వెంకటరమణ తెలిపారు. ఏలూరులోని అమీనా పేటలో ఉన్న మున్సిపల్ పోలీస్ లయన్స్ స్కూల్‌లో 75 మంది పిల్లలకు పుస్తకాలు, నోటు పుస్తకాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హేలాపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పి.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకే ఈ కార్గిల్ దివస్ దినోత్సవం సందర్భంగా వారికి వివరించడం జరిగిందన్నారు. అంతే కాకుండా విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించేందుకు పుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా శుక్రవారం మలేరియా విభాగం వారితో దోమల లార్వా నిర్మూలనకు పిచికారీ, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్.మాలతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 37వ డివిజన్‌లోని గుబ్బలవారివీధి, రంగున్‌మేడ రోడ్డు, అతిథి హోటల్ రోడ్డు, రాఘవచారి రోడ్డు, తదితర ప్రాంతాల్లో కార్యక్రమం నిర్వహించారు.

బాలికల వసతి గృహం సందర్శన

కలిదిండి :మండలంలోని కోరుకొల్లు సోషల్ వెల్ఫేర్ బిసి బాలికల వసతి గృహాన్ని ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు శుక్రవారం సందర్శించారు. 27 మంది విద్యార్థులకు 24 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఉదయం విరామ సమయంలో వేరుశెనగ చిక్కీ ఇవ్వలేదన్నారు. వెల్ఫేర్ అధికారి నాగమణిని ప్రశ్నించగా స్టాక్ అయిపోయిందని, గత పది రోజులుగా విద్యార్థులకు అందించడం లేదని చెప్పారన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - భీమడోలు

దేశాభివృద్ధిలో కీలక పాత్ర వహించే మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వావలంభన సాధించే దిశగా కృషి చేయాలని భీమడోలుకు చెందిన ప్రముఖ మహిళా న్యాయవాది టి.రాణి కోరారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళా సాధికారికత అంశంపై వందరోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక అవగాహన సదస్సులో భాగంగా గుండుగొలను హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. దీనిలో భాగంగా శుక్రవారం బేటీకోపడావో-బేటికో బచావో అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అంగన్వాడీ కార్యకర్త బి.రాజామణితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని భీమడోలు ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్‌కు చెందిన పర్యవేక్షకులు షహనాజ్ బేగం, కవిత, నూర్జహాన్ బేగం పర్యవేక్షించారు.

ఉంగుటూరు :నారాయణపురం మహాత్మగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బేటి బచావో - బేటి పడావో సెక్టోరల్ లెవెల్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బివి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాలికలు చదువు కొనసాగించాలన్నారు. చేబ్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ శారదామణి పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో చదువుతున్న బాలికలు అడిగిన పలు సందేహాలకు నిర్వాహకులు సమాధానాలిచ్చారు.

ముసునూరు : కిశోరా బాలికల సంరక్షణ వందరోజుల కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి చెప్పారు. మండల కేంద్రమైన ముసునూరు హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులతో మాట్లాడుతూ మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో క్రీడా స్ఫూర్తితో ముందంజలో ఉండాలన్నారు. మహిళా రక్షణ కోసం ప్రత్యేక మూడు చట్టాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలియజేస్తూ అవగాహన కల్పించారు.

జీలుగుమిల్లి :బాలికల్లో లింగ నిష్పత్తిని తగ్గించేలా కృషి చేయాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ తెలిపారు. భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జీలుగుమిల్లిలోని ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

నూజివీడు టౌన్ :ప్రతి పాఠశాల, కళాశాలలో బాలికల పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (పిఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి డి.శివకుమార్ కోరారు. సమాజంలోని లైంగిక దాడులకు వ్యతిరేకంగా పట్టణంలోని శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గత పాలనలో దిశా చట్టం మాదిరిగా, నేటి పాలనలోనూ పటిష్టమైన చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాలికలు పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి ప్రదర్శనగా వెళ్లి చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.

ఘనంగా సత్తిబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలకు సేవ చేస్తానని టిడిపి రైతు సంఘం నాయకులు ముళ్లపూడి సత్తిబాబు అన్నారు. స్థానిక నాగేంద్ర స్వామి కళ్యాణమండపంలో ఆయన 59వ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఆయనతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం అనేది తనకు ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని తెలిపారు. అనంతరం ఆయనకు పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెండ ఝాన్సీ భాస్కరరావు, గుడివాడ గణేష్, వీరవల్లి శివయ్య, గోల్కొండ చంద్రశేఖర్, గుడివాడ మురళీ, నల్లమోతు పెదబాబు, బండి రంగారావు పోనపరెడ్డి కోటేశ్వరరావు, తలారి రాజేష్, మారగాని మురళీకృష్ణ పాల్గొన్నారు.